అమ్మఒడి మెగా చెక్కును అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

1,60,397 మందికి అమ్మఒడి సాయం

తల్లుల ఖాతాల్లో రూ. 208.516 కోట్ల జమ

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి జగనన్న అమ్మఒడి పథకం కింద 1,60,397 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం రూ.208.516 కోట్లను జమ చేసింది. బుధవారం నాడు పుట్టపర్తి కలెక్టర్‌లో జిల్లా స్థాయి అమ్మఒడి పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ పి.అరుణ్ బాబు, జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డ్ ఛైర్మన్ రమణారెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ ఓబులపతి, ఇన్‌ఛార్జి డిఇఒ రంగస్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అమ్మఒడి 4వ విడత సాయం కింద రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని 1,60,397 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ. 208.516 కోట్లను జమ చేసిందని చెప్పారు. పేద కుటుంబాల్లోని పిల్లల చదువులకు పేదరికం అడ్డు కాకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న అమ్మఒడి పథకాన్ని అమలు చేస్తోందని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవాలని ఆకాంక్షించారు. జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డ్ ఛైర్మన్ రమణారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మారుస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని పేద విద్యార్థులు ఉన్నతంగా చదువుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు రూ.208.516 కోట్ల మెగా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు, విద్యార్థులు పాల్గొన్నారు.

త్యాగాలకు ప్రతీక బక్రీద్

నేడు ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు

ఖుర్బానీ ఇవ్వనున్న ముస్లిములు

ప్రజాశక్తి-అనంతపురం, ఆత్మకూరు

త్యాగానికి ప్రతీకగా అయిన బక్రీద్ పండుగను ముస్లిములు గురువారం జరుపుకోనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ ముస్లిములు బక్రీద్ పండుగను పురస్కరించుకుని ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో ఈద్గాలను ప్రార్థనల నిమిత్తం అన్ని వసతులతో సిద్ధం చేశారు. అనంతపురం నగరంతో పాటు గుత్తి, తాడిపత్రి, గుంతకల్లు, సత్యసాయి జిల్లాలో హిందూపురం, పెనుకొండ, కదిరి, ధర్మవరం పట్టణాల్లోని ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనల కోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. పండుగను పురస్కరించుకుని పలువురు ప్రజాప్రతినిధులు ముస్లిములకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. సోదరభావంతో పండుగలను అందరూ కలిసిమెలిసి చేసుకోవాలని ఆకాంక్షించారు.

బక్రీద్‌కు ప్రత్యేకం ఖుర్బానీ

బక్రీద్ అంటే బకర్ ఈద్ అని అర్థం. బకర్ అంటే మూగజీవి.. ఈద్ అంటే పండుగ అని అర్థం. బక్రీద్ పండుగకు ఖుర్బానీని ప్రత్యేకంగా చెప్పవచ్చు. దీనికి ఓ కథ ప్రాచూర్యంలో ఉంది. తమ ప్రియమైన వస్తువులను త్యాగం చేయమని దేవుడు చెప్పినట్లు భావించి అబ్రహం(ఇబ్రహీం) తన కుమారుడు ఇస్మాయిల్‌ను బలి చేసేందుకు సిద్ధపడతాడు. ఆయన త్యాగానికి మెచ్చిన అల్లాహ్ కుమారుని ప్రాణత్యాగానికి బదులు ఓ మూగ జీవాన్ని బలి ఇవ్వాలని చెబుతాడు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం బక్రీద్ పండుగ రోజున ఖుర్బానీ ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. బలి ఇచ్చిన మూగజీవాలను మూడు భాగాలుగా చేసి.. అందులో ఓ వంతు పేద ప్రజలకు, రెండో వంతు తమ చుట్టాలకు, మూడో వంతు భాగాన్ని తమ కుటుంబం కోసం వాడుకుంటారు. అందుకే బక్రీద్ పండుగ రోజున ముస్లిలందరూ ఖుర్బానీ ఇస్తారు.

తమ్ముళ్లకు పిలుపు

- వివాదాలపై అధిష్టానం సీరియస్
- రచ్చపై అమరావతిలో పంచాయితీ
- భవిష్యత్తుకు గ్యారెంటీ బస్సుయాత్ర నిర్వహణపైనా అసహనం



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

భవిష్యత్తుకు భరోసా బస్సు యాత్ర కాస్త టిడిపి నాయకుల మధ్య విభేదాల యాత్రగా కొనసాగుతోంది. వరుసగా జిల్లాలో కొనసాగుతున్న వివాదాలపై టిడిపి అధిష్టానం సీరియస్‌గా దృష్టి సారించినట్టు తెలుస్తోంది. గొడవలు జరుగుతున్న నియోజకవర్గాల్లోని నేతలను త్వరలో అమరావతికి పిలిపించనున్నట్టు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 23వ తేదీన భవిష్యత్తుకు బస్సుయాత్ర ప్రారంభమైంది. ప్రారంభమైనప్పటి నుంచి కొన్ని నియోజకవర్గాల్లో పార్టీలోని అంతర్గత విభేదాలు రచ్చకెక్కుతున్నాయి. ఎన్నికలు సమీస్తున్న తరుణంలో జరుగుతున్న పరిణామాలు చర్చనీయాంశమవుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పెనుకొండ, కళ్యాణదుర్గం, మడకశిర, శింగనమల నియోజకవర్గాల్లో విభేదాలు అధికంగానున్నాయి. పెనుకొండ, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో బస్సుయాత్ర పూర్తయ్యింది. ఈరెండు చోట్ల కూడా నాయకులు బాహాటంగానే ఘర్షణకు దిగి కొట్టుకున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉమామహేశ్వర నాయుడులు రెండు గ్రూపులుగా విడిపోయి కొట్టుకున్నారు. జిల్లా నేతల ముందే ఇవి జరుగుతున్నా వాటిని పుల్‌స్టాప్ పెట్టే ప్రయత్నంగాని, నిలువరించే చర్యలుగాని చేపట్టలేకపోయారు. దీనిపైనా అధిష్టానం సీరియస్ అయినట్టు సమాచారం. జిల్లా ముఖ్య నేతలకు ఫోన్ చేసి అధినాయకుడు క్లాస్ పీకినట్టు తెలుస్తోంది. ఇక మడకశిర నియోజకవర్గంలో బస్సుయాత్రనే రద్దు చేశారు. ఇక శింగనమల నియోజకవర్గంలో ఇంకా యాత్ర జరగాల్సి ఉంది. ఇక్కడ ఏమి జరుగుతుందోనని చర్చ ఆ పార్టీ శ్రేణుల్లో నెలకొంది. అంతకుమునుపు లోకేశ్ పాదయాత్ర సమయంలోనే నాయకుల మధ్య విభేదాలు పొడచూపిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ యాత్రలో ఏమి జరుగుతుందోనన్న గుబులు ఆ పార్టీ శ్రేణుల్లో నెలకొంది. ఇలా విభేదాలు రచ్చకెక్కుతుండటంతో అధిష్టానం దృష్టి సారించింది. ఈ నియోజకవర్గాల్లోని నాయకులతోపాటు, ముఖ్య నాయకులతో వచ్చే వారంలో ప్రత్యేకమైన సమావేశం ఏర్పాటు చేసింది. విభేదాలతో రచ్చకెక్కుతున్న నేతలకు ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి అధినాయకుడు చంద్రబాబునాయుడు క్లాస్ పీకనున్నట్టు సమాచారం. పార్టీ ప్రతిపక్షంలో ఉండి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ నేతల తీరులో మార్పు రాకపోవడంపై ఆగ్రహంతో ఉన్నట్టు తెలుస్తోంది. ఇదివరకే అనేక మార్లు నేతలకు సర్ధిజెప్పే ప్రయత్నాలు చేసినా ఫలితం

లేకపోవడంతో ఈసారి జరిగే సమావేశంలో ఎటువంటి నిర్ణయాలు చేస్తారన్నది పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. నియోజకవర్గాల్లో ఈ రకమైన పరిస్థితి ఉంటే జిల్లా నేతలు ఏమి చేస్తున్నారన్న దానిపై దృష్టి సారించినట్టు తెలుస్తోంది. ఇప్పటికే పార్టీ అధిష్టానం నుంచి ముఖ్య నేతలకు అక్షింతలు పడినట్టు సమాచారం. ఎన్నికలు కొన్ని నెలల్లో ఉన్న సమయంలో ఇప్పటికైనా అందరినీ సమన్వయం చేసుకుని ముందుకెళ్లాల్సిన సమయంలో ఇదేతీరున కొనసాగడం పార్టీ క్షేత్ర స్థాయి నేతల్లో ఆందోళన రేకెత్తిస్తోంది. అధిష్టానం సీరియస్‌గా దృష్టి సారించి వీటిని పుల్‌స్టాప్ పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ కార్యకర్తలు కోరుతున్నారు. లేకపోతే వచ్చే ఎన్నికల్లో నష్టం జరుగుతుందని భావిస్తున్నారు.

డ్రగ్స్ రహిత జిల్లాగా మారుద్దాం

ఎస్పీ మాధవరెడ్డి, కలెక్టర్ పి.అరుణ్ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి, కలెక్టర్ అరుణ్‌బాబు

శ్రీ సత్యసాయి జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్పీ మాధవరెడ్డి, కలెక్టర్ పి.అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. బుధవారం నాడు పుట్టపర్తి కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నివారణ (నార్కోటిక్స్ డ్రగ్స్, సైకోట్రోపిక్ పదార్థాలు, ఎన్డీపిఎస్)పై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో డ్రగ్స్ సంస్కృతి ఇప్పుడిప్పుడే మొదలవుతోందని, ఇది మరింత విస్తృతం కాకుండా ఆదిలోనే అరికట్టాలన్నారు. జిల్లాలోని కదిరి ప్రాంతంలో డ్రగ్స్ కేసులు వస్తున్నాయని, ఈ ప్రాంతంలో డ్రగ్స్ వినియోగంపై ప్రత్యేక దష్టి సారించాలన్నారు. పరిశ్రమల ప్రాంతాల్లో డ్రగ్స్ వాడకంపై నిఘా పెట్టాలన్నారు. సరిహద్దులు, పరిశ్రమల ప్రాంతాల్లో నాకాబందీ పెట్టాలన్నారు. డ్రగ్స్ సరఫరా మూలాలు ఎక్కడున్నాయి అనేది కనిపెట్టి, ఆ మూలాలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోకి డ్రగ్స్ ప్రవేశించకుండా చేపడుతున్న చర్యలను మరింత విస్తృతంగా చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, అడిషినల్ ఎస్పీ విష్ణు, ఆర్డీవోలు భాగ్యరేఖ, తిప్పేనాయక్, రాఘవేంద్ర, బిసి వెల్ఫేర్ శాఖ అధికారి నిర్మలా జ్యోతి, డిటిడబ్ల్యువో మోహన్ రామ్, ఎఫ్ఆర్ఒ వేణుగోపాల్, ఇంటెలిజెన్స్ డీఎస్పీ గోవింద్, పట్టుపరిశ్రమ శాఖ జెడి పద్మమ్మ, సోషల్ వెల్ఫేర్ డిడి శివరంగ ప్రసాద్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ అనుపమ, వివిధ శాఖల అధికారులు, పాల్గొన్నారు.

'అమ్మ డెయిరీ' ద్వారా కల్తీలేని పాలవిక్రయం

రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

డ్వాక్రా మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

పది వేలమంది అమ్మల ఆధ్వర్యంలో నడిచే 'అమ్మ సహకార డెయిరీ' ద్వారా కల్తీలేని పాలను అందిస్తున్నారని, వీటిని ప్రతి కుటుంబం కొనుగోలు చేయాలని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కోరారు. బుధవారం నాడు అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి కాలనీ, పాపంపేట సచివాలయాల పరిధిలోని డ్వాక్రా సంఘాల లీడర్లు, మహిళలతో సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సాధికారితే లక్ష్యంగా అమ్మ డెయిరీని ఏర్పాటు చేశామన్నారు. ఈ డెయిరీ నుంచి జూలై 1వ తేదీ నుంచి పాలను సేకరిస్తారని చెప్పారు. రూపాయి తక్కువ ధరకే నాణ్యమైన పాలను ఇంటికి చేరుస్తారన్నారు. అమ్మ డెయిరీ ద్వారా పాడి రైతులకూ ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. మహిళా రైతులకు మంచి చేస్తూ, ప్రజలకు నాణ్యమైన పాలను అందివ్వడమే అమ్మ డెయిరీ లక్ష్యం అన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాలో వ్యకాసం నాయకులు

ప్రజాశక్తి -పెనుకొండ

పట్టణంలో ఇల్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని వ్యవసాయ కార్మికసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్ మాట్లాడుతూ జగనన్న లేఅవుట్‌లో ఆక్రమణదారుల చేతుల్లో ఉన్న స్థలాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని అర్జీ పెట్టుకున్న ఇల్లులేని నిరుపేదలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. గత రాష్ట్ర ప్రభుత్వం పెనుకొండ పట్టణంలో పేద ప్రజలకు ఇంటి స్థలాలు ఇవ్వడానికి భూమిని సేకరించిందని తెలిపారు. అందులో ఇప్పటికే రెండు విడతలుగా వందలాది మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చి పక్కా గహాలు నిర్మించగా ఇందులో భవిష్యత్ తరాల అభివృద్ధి అవసరాల కోసం 5 ఎకరాల వరకు ఖాళీగా భూమిని ఉంచారన్నారు. ప్రస్తుతం ఈ భూమిలో గత సంవత్సర కాలంగా అధికార పార్టీకి సంబంధించిన ద్వితీయ శ్రేణి నాయకులు , కార్యకర్తల ప్రోద్బలంతో, పలుకుబడితో అనర్హులుగా ఉన్న కొంతమంది ఆక్రమించుకుంటూ వేలాది రూపాయలను సొమ్ము చేసుకుంటున్నారని విమర్శించారు. భూమిని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ కె. కార్తీక్ ను కోరారు. రెండు నెలల కాలం నుండి ఇల్లు లేని నిరుపేదలు తమకు ఇళ్లస్థలాలు కేటాయించాలని అధికారులకు పలుమార్లు వినతులు సమర్పించారన్నారు. ఇప్పటికైనా జోక్యం చేసుకొని ఆక్రమణదారుల చేతుల్లో ఉన్న స్థలాలను స్వాధీనం చేసుకొని దరఖాస్తు చేసుకున్న ప్రతి పేదవానికి స్థలాలు కేటాయించి పక్కగృహాలు మంజూరు చేయాలని కోరారు . లేనిపక్షంలో 15 రోజుల తర్వాత ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు వెంకటరాముడు, జయమ్మ, అంజి, సుగుణమ్మ,గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

సమస్యను సబ్‌కలెక్టర్‌కు వివరిస్తున్న నాయకులు

సిబ్బందిని నియమించకుంటే సచివాలయాలకు తాళాలు వేస్తాం

మండలమీట్‌లో హెచ్చరించిన సర్పంచులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మండలంలోని గ్రామ సచివాలయాలలో సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించి ప్రజా సమస్యలను పరిష్కరించకపోతే గ్రామ సచివాలయాలకు తాళాలు వేస్తామని పుట్టపర్తి మండల సర్పంచులు మూకుమ్మడిగా హెచ్చరించారు. బుధవారం పుట్టపర్తి మండల సర్వసభ్య సమావేశం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు .ఈ సమావేశానికి ఎంపిపి రమణారెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మీనరసమ్మ, తహశీల్దార్ నవీన్ కుమార్, ఎంపీడీవో అశోక్ కుమార్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు కేసీ రంగన్న ,హనుమంత రెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ శాఖల అధికారులు తమ తమ శాఖ పనితీరును సభ్యుల ముందు వివరించారు. ఈ సందర్భంగా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కుల్లాయి రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం కానీ అధికారులు గాని సర్పంచులను పట్టించుకోవడం లేదన్నారు. గ్రామంలో సమస్యలు రాజ్యమేలుతున్నా ఎవరూ పట్టించుకోవటం లేదన్నారు. ప్రతి సర్వసభ్య సమావేశంలోనూ సమస్యలను ఏ కరువు పెట్టినా వాటిని తీర్చే నాథుడే లేడని వాపోయారు. సర్పంచులుగా ఎన్నికైన నాటినుండి నేటి వరకు ఏడు సర్వసభ్య సమావేశాలు నిర్వహించారని ,ప్రతిసారి సమస్యలను విన్నవించడమే తప్ప వాటిని పరిష్కరించిన దాఖలా లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ సచివాలయాల్లో సిబ్బంది కొరత తో ప్రజా సమస్యలు తీరక సర్పంచులు, ఎంపీటీసీల, వద్దకు ప్రజలు వచ్చి తమ గోడును వెళ్లబోసుకుంటున్నారని అన్నారు. కోట్లపల్లి సచివాలయంలో ఇంజనీరు, సర్వేయరు, హౌసింగ్ అసిస్టెంట్ ఇంజనీరు, సిబ్బంది లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నామన్నారు. సమస్యలు మరోసారి జరిగే సర్వసభ్య సమావేశంలోపు తీర్చకపోతే సమావేశానికి సభ్యులు హాజరు అయ్యేది లేదనితెగేసి చెప్పారు. అంతేకాక సచివాలయాల్లో సిబ్బంది కొరత తీర్చకపోతే సచివాలయాలకు తాళాలు వేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

తనకల్లు : మండల పరిధిలోని పాల్యంవారి పల్లి ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అభిమానులు నోటుపుస్తకాలు, విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే కందికుంట వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఆయన అభిమానులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రవీంద్రారెడ్డి, సీనియర్ నాయకులు రామిరెడ్డి, రాష్ట్రతెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ తాజుఖాన్, సోమశేఖర్, ఆనంద, రామలింగారెడ్డి, శీనా, ముని, వినోద్ పాల్గొన్నారు.

మినీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లండి

మాజీ మంత్రి పరిటాల సునీత

ప్రజాశక్తి-రామగిరి

టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన మినీ మ్యానిఫెస్టోను ప్రతి ఇంటికీ చేర్చాల్సిన బాధ్యత కుటుంబ సాధికార సారథులదేనని మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. మినీ మ్యానిఫెస్టో ప్రచార కార్యక్రమానికి సంబంధించి బుధవారం మండలంలోని వెంకటాపురంలోని తన స్వగృహంలో రామగిరి మండల పరిధిలోని టిడిపి నాయకులు, క్లస్టర్, సెక్షన్ ఇన్‌ఛార్జులతో సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యంగా మ్యానిఫెస్టోలోని ఆరు ముఖ్యమైన అంశాల గురించి సునీత వివరించారు. కుటుంబ సారథులు ప్రతి రోజు కనీసం రెండు మూడు ఇళ్లకు వెళ్లి ఈ పథకాల గురించి వివరించాలన్నారు.

బస్సు యాత్రతో వైసిపిలో వణుకు : తెలుగుదేశం పార్టీ చేపట్టిన బస్సు యాత్రతో వైసీపీ నాయకుల్లో వణుకు మొదలైందనిమాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. బస్సు యాత్రకు సంబంధించి పార్టీ నాయకులతో కలసి రామగిరి మండలం వెంకటాపురంలోని తన నివాసంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 26వ తేదీన బస్సు యాత్ర రాప్తాడు నియోజకవర్గంలోకి ప్రవేశిస్తుందని తెలిపారు. ఒకరోజు పాటు జరిగే బస్సుయాత్రలో నాలుగేళ్ల వైసీపీ ప్రభుత్వంలో అభివద్ధి ఎంత వెనుకబడిందో వివరిస్తామని తెలిపారు. ఈ బస్సుయాత్రను విజయవంతం చేయాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి పరిటాల సునీత

రాష్ట్రస్థాయి పోటీలకు ధర్మవరం క్రీడాకారులు

ధర్మవరం టౌన్ : రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ధర్మవరం క్రీడాకారులు ఎంపికైనట్టు ధర్మాంభ బాస్కెట్‌బాల్ అసోషియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. ఈమేరకు ఈనెల 18న అనంతపురం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన టోర్నమెంట్లో ధర్మవరం క్రీడాకారులు కిరణ్మయి, సల్మా, తరుణ్ ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను శెట్టిపి జయచంద్రారెడ్డితో పాటు అసోషియేషన్ అధ్యక్షులు మేడాపురం రామిరెడ్డి, సెక్రటరీ వాయల్పాడు హిదయతుల్లా, కోచ్ సంజయ్ అభినందించారు. ఎంపికైన క్రీడాకారులు కృష్ణాజిల్లా నూజివీడులో ఈనెల 29వతేదీ నుంచి జూలై 2వతేదీ వరకు జరిగే 8వ ఏపీ రాష్ట్రస్థాయి జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ బాస్కెట్ బాల్ పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు.

జీవో 423ను రద్దు చేయాలి

కదిరి టౌన్ : జీవో 423ను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ డిమాండ్ చేశారు. సచివాలయ వ్యవస్థ ఏర్పడిన నాటి నుంచి వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న సుమారు 3500 మందికి పైగా వార్డు పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పర్యావరణ కార్యదర్శులపై కిందిస్థాయి అధికారులు తీవ్ర పనిభారం మోపుతు, ప్రభుత్వ ఆదేశాలకు వ్యతిరేకంగా చెత్త పన్నుపై సేవా రుసుమును వసూలు చేసే బాధ్యతను అప్పగిస్తున్నారని విమర్శించారు. ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించాలని అనేకమార్లు సిడిఎంఎ దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకుండా పోయిందన్నారు. మిగిలిన సచివాలయ ఉద్యోగులాగా వార్డు పారిశుద్ధ్య పర్యావరణ కార్యదర్శులకు కూడా సచివాలయ పని వేళల్లోనే విధులు నిర్వహించుకునే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలన్నారు.

ప్రజాసంక్షేమమే వైసిపి ధ్యేయం

గోరంట్ల రూరల్: ప్రజా సంక్షేమమే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మాల గుండ్ల శంకర్ నారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం గోరంట్ల మండల పరిధిలోని వానవోలు పంచాయతీ లో నిర్వహించి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రమీల మూర్తి సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ పాటూరు శంకర్ రెడ్డి ,కలగేరి లక్ష్మీరెడ్డి,సచివాలయ కన్వీనర్ సమరసింహారెడ్డి, నర్సింహపల్లి శివారెడ్డి వైసీపీ నాయకులు, తహశీల్దార్ రంగనాయకులు, ఎంపీడీవో రఘునాథ గుప్త సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అమరాపురం : మండల పరిధిలోని శివరం సచివాలయ పరిధిలో సర్పంచి చిత్తన్న యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పేస్వామి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రజాసంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఈరన్న, వైస్ ఎంపీపీలు లలితమ్మ, కృష్ణమూర్తి, జెడ్పీటీసీ సారక్క నరసింహమూర్తి రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్ పర్సన్ నళిని రంగేగౌడ్, డైరెక్టర్ వీరక్యాతప్ప, గగన తనువీర్ గౌడ్‌తో పాటు ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

తలుపుల : సమస్యల పరిష్కారానికే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టామని ఎమ్మెల్యే డాక్టర్ పివి. సిద్ధారెడ్డి అన్నారు. నూతన కాలువ సచివాలయ పరిధిలో బండ్లపల్లి బీసీ కాలనీ, పల్లవాండ్లపల్లి, ఎగువ దళితవాడ గ్రామాలలో బుధవారం నిర్వహించిన గడపగడప మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఇంటింటికి తిరిగి ప్రజాసమస్యలను అడిగితెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ మహమ్మద్ రఫీ నాయక్, వైసిపి జోనల్ ఇన్చార్జ్ డీకే బాబు, నాయకులు పురుషోత్తం రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి మడకశిర రూరల్

జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్ అండ్ బి వసతి గృహం వద్ద బుధవారం వైసిపి నాయకులతో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న సురక్ష సర్వే భాగంగా అర్హులందరికీ న్యాయం జరుగుతుందన్నారు. ఎన్నికలు 8నెలలు ఉన్నప్పటికీ ఇంటికి వెళ్లి సమస్యలు తెలుసుకున్న దమ్ము జగన్ ప్రభుత్వానికి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సరోజమ్మ, మూర్తి, వైసిపి మండల కార్యదర్శి తిమ్మారెడ్డి, వైస్ ఎంపీపీ నరసింహమూర్తి, డీలర్ చంద్ర, కన్వీనర్లు పాల్గొన్నారు.

గోరంట్ల రూరల్: గోరంట్ల మండల పరిధిలోని కమ్మవారి పల్లి గ్రామంలో నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని జిల్లా పంచాయతీ అధికారి విజయకుమార్ రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. జగనన్న సురక్ష సర్వే తీరును పరిశీలించారు. అనంతరం డిపిఒ సచివాలయాన్ని తనిఖీ చేసి సిబ్బంది పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘ వ్యాప్తంగా ఆయా వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని వార్డు అమ్యూనిటి సెక్రటరీలకు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ సూచించారు. బుధవారం 18వార్డు సచివాలయంలో అమ్యూనిటీ సెక్రటరీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సచివాలయల పరిధిలో జరుగుతున్న అభివృద్ధిని సమీక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, అమ్యూనిటీ సెక్రటరీలు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

మడకశిర రూరల్ : అగళికి చెందిన కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ దేవరాజు కొన్ని నెలల నుండి అనారోగ్యం తో బాధ పడుతున్నారు. అస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే తిప్పే స్వామి సిఎం సహాయ నిధి కింద రూ.2లక్షలు మంజూరు చేయించారు. ఈ రూ. 2 లక్షల విలువైన చెక్కును మడకశిరలో బాధితుడి సోదరుడు జయరామప్పకు ఎమ్మెల్యే అందజేశారు.

సామూహిక సీమంతాలు

మడకశిర రూరల్ : మండలంలోని నీలకంఠాపురం గ్రామంలో మాజీ మంత్రి రఘువీరా కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నీలకంఠాపురం పిహెచ్‌సిలో 85 మంది గర్భిణులకు బుధవారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. సాంప్రదాయబద్ధంగా పండ్లు, పూలు, బేబీ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రఘువీరా కోడెల దీక్షిత, అమిత్ రఘువీరా, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

శుద్ధజలకేంద్రం ప్రారంభం

సోమందేపల్లి : మండల కేంద్రంలోని జగ్జీవన్ రావు నగర్ లో బుధవారం మేజర్ పంచాయతీ సర్పంచి గంగాదేవి నరసింహమూర్తి ఆధ్వర్యంలో వైయస్సార్ సుజల స్రవంతి తాగునీటి పథకాన్ని ప్రారంభించారు. పందిపర్తి గ్రామం వద్ద ఏర్పాటుచేసిన మదర్ ట్యాంక్ నుండి ఫిల్టర్ వాటర్ ను అందుబాటులోకి తీసుకువచ్చి కేవలం ఐదు రూపాయలకే 20 లీటర్ల క్యానును అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు నరసింహమూర్తి, ఎల్లారెడ్డి, వెంకటనారాయణ రెడ్డి, ఆనందప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటు లేఅవుట్ తొలగింపు

రొళ్ల : మండల కేంద్రంలోని ప్రధాన రహదారి పక్కన బిడు భూమిగా ఉన్న సర్వే నంబర్ 186-1 లోని1.83 ఎకరాలు, 187-3లోని0-84 ఎకరాలు, 187-4 లోని మొత్తం 3.53 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ప్రయివేటు లే అవుట్‌ను అధికారులు తొలగించారు. వీరభద్రయ్య అనే వ్యక్తి ప్రయివేటు లే అవుట్ వేసి రెండు సెంట్ల ప్రకారం సరిహద్దు రాళ్లు కూడా నాటారు. ఈ లేఅవుట్‌కు ప్రభుత్వ అనుమతి లేదని గ్రామపంచాయతీ అధికారులు తేల్చారు. లేఅవుట్‌లో నాటిన సరిహద్దు రాళ్లను తొలగించారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్ మాట్లాడుతూ ఈ లేఅవుట్‌కు సంబంధించి మూడుసార్లు గ్రామపంచాయతీ నుండి నోటీసులు పంపిన స్పందన కన్పించలేదన్నారు. ప్రభుత్వం జారీ చేసిన2002 సంవత్సరం జీవో నెంబర్ 67 ప్రకారం గ్రామపంచాయతీ అధికారుల నుంచి గాని, అసాదా నుంచి గాని, డిటిసిపి నుండి గాని ఎలాంటి అనుమతి తీసుకోకుండా లేఅవుట్ వేశారన్నారు. నిబంధనలు పాటించని ఈ లేఅవుట్‌లో స్థలాలు అమ్మడం, కొనడం నేరమని చెప్పారు.

సిద్ధార్థ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

పెనుకొండ : పట్టణంలోని సిద్ధార్థ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి హర్ష కుమార్ మాట్లాడుతూ పాఠశాలలోని అవని మోహన్ అనే విద్యార్థి సోమవారం అదృశ్యం అయ్యాడన్నారు. ఇలా జరగడానికి పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యమే అని అన్నారు..ఈ పాఠశాల హాస్టల్ అనుమతి లేకపోయినా హాస్టల్ నిర్వహిస్తూ ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదని విమర్శించారు. నిబంధనలు పాటించనటువంటి పాఠశాల పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యను నాయకులు ఈసందర్భంగా డివైఇఓ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన పాఠశాలను తనిఖీ చేసి శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు భరత్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందాలి

కొత్తచెరువు : అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ సీఈవో భాస్కర్ రెడ్డి తెలిపారు. బుధవారం కొత్తచెరువులోని రెండవ సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. జగనన్న సురక్ష పథకం అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఉద్యోగుల పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. అనంతరం గాంధీనగర్ వీధిలో ఇళ్ల వద్దకు వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సిద్ధారెడ్డి, పంచాయతీ కార్యదర్శి గోపాల్, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

కోచింగ్ సెంటర్ పై చర్యలకు డిమాండ్

కదిరి టౌన్ : పట్టణంలోని వేమారెడ్డి సర్కిల్ లో నిర్వహిస్తున్న కెపెసిటర్ కంప్యూటర్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలని రాయలసీమ విద్యార్థి యువజన సంఘం నాయకులు అరుణ్ డిమాండ్ చేశారు. ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కదిరి పట్టణంలోని ఎన్ఏసీ కంప్యూటర్స్ యాజమాన్యం యువతకు ఫేక్ సర్టిఫికెట్లు అమ్ముతోందని ఆరోపించారు. ఈ విషయంపై ఎంఇఒ, తహశీల్దార్, ఆర్డీవోకు ఫిర్యాదు చేసిన ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ప్రభుత్వ అధికారులందరూ తమ పరిధిలో రాదని అంటున్నారనిమరి ఆ ఇనిస్టిట్యూట్ ఎవరి పరిధిలోకి వస్తుందని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కోచింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

క్విజ్ పోటీల్లో బత్తలపల్లికి తృతీయ బహుమతి

బత్తలపల్లి : రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకింగ్,ఆర్థిక లావాదేవీలపై జిల్లాస్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీలలో బత్తలపల్లి విద్యార్థినులు తృతీయ బహుమతి సాధించారు. బుధవారం సత్య సాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తి లోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో జరిగిన పోటీల్లో జిల్లావ్యాప్తంగా ఉన్న 33 మండలాల జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలలో బత్తలపల్లి బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ఎస్.మదీహా, ఆఫ్రిన్ మూడవ స్థానంలో నిలిచి తృతీయ బహుమతి అందుకున్నారు. మూడవ స్థానంలో నిలిచిన విద్యార్థినులకు 5వేల రూపాయలు నగదు బహుమతి అందుకున్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-ముదిగుబ్బ

విద్యుత్ సమస్యలపై ఈనెల 30న స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని సిపిఐ నాయకులు కోరారు. విద్యుత్‌ఛార్జీలు పెంచి సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా సబ్‌స్టేషన్ ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు, నాయకులు గుంజేపల్లి కృష్ణయ్య, తిప్పయ్య, దాబా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటరు నమోదు

ప్రజాశక్తి-బుక్కపట్నం

పారదర్శకంగా ఓటరు నమోదు జాబితాను తయారు చేయాలని ఆర్డీవో భాగ్యరేఖ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రం నందు ఓటరు నమోదుపై వీఆర్వోలు, బిఎల్ఒలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఓటరు నమోదు కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కరుణాకర్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

నేడు అక్కమ్మగార్ల జాతర

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని గుట్టకిందపల్లి వద్ద గురువారం అక్కమ్మగార్ల పరుష ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు పూజారులు గుంజరమహేశ్, బయన్న తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

3న పౌర్ణమి గరుడ సేవ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో గల శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో ప్రతినెల పౌర్ణమి గరుడ సేవను దాతల సహాయ సహకారాలతో నిర్వహిస్తున్నామని ఆలయ చైర్మన్ దాశెట్టి సుబ్రహ్మణ్యం, ఈవో వెంకటేశులు పేర్కొన్నారు. జూలై మూడవ తేదీన పౌర్ణమి గరుడ సేవను సాయంత్రం 6 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గరుడ సేవ దాతలుగా కోటి లక్ష్మి వెంకటేశ్వర్లు, సుధర్ల రాణి, కోటి రూపా దేవి, కోటి శ్రీవత్స, చిరంజీవి కోటి అచ్యుత రామ్, శ్రీ లక్ష్మి, సిద్ధేశ్, తోమండ్ర సాయి శివ తేజ వ్యవహరిస్తున్నారని తెలిపారు.

విద్యార్థుల సమయానికి అనుగుణంగా
బస్సులను నడపండి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం మలగూరు గ్రామం నుంచి వచ్చే విద్యార్థులకు అనుగుణంగా ఆర్‌టిసి బస్సులను నడపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నాయకులు విద్యార్థులతో కలిసి బుధవారం స్థానిక డిఎం కార్యాలయం ముందు ఆందోళన చేసి, ఆర్‌టిసి సిఐకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బాబావలి మాట్లాడుతు పట్టణంలో ఉన్నా వివిధ కళాశాల, పాఠశాలలకు మలగూరు గ్రామం నుంచి 50 మందికి పైగా విద్యార్థులు వస్తున్నారన్నారు. అయితే విద్యార్థులకు అనుగుణంగా బస్సులు లేక పోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వీరి సమయానికి అనుగుణంగా బస్సులు నడపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు హర్ష కుమార్, మలుగూరు విద్యార్థులు చంద్రశేఖర్, మధు, హేమంత్, వంశీ, పండు, గౌతమ్, అభి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం సమర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

వృద్ధాశ్రమంలో నిత్యావసర సరుకులు అందజేస్తున్న దృశ్యం

వృద్ధాశ్రమంలో నిత్యావసర సరుకులు అందజేత

ప్రజాశక్తి - బత్తలపల్లి

తాడిమర్రి మండలం నార్సింపల్లిలోనిఆర్ఎస్ఎస్ వృద్ధాశ్రమంలో నిత్యావసర సరుకులు అందజేశారు. గ్రామానికి చెందిన జగదీష్ పుట్టినరోజు సందర్భంగా ఆయన మిత్రులు బుధవారం వృద్ధాశ్రమంలో వేడుకులు నిర్వహించారు.. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ అనాథ వృద్ధుల మధ్య జన్మదిన వేడుకలు జరుపుకోవడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఆశ్రమానికి నిత్యావసర సరుకులు, నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు శ్రీనివాసులు, జగదీష్ మిత్రులు మంజుల రాధాకృష్ణ, నల్లబోయినపల్లి లోకనాథ్ రెడ్డి, జాంపుల అజయ్ చౌదరి, మదనాపు కృపాకర్, మదనాపు రమేష్, చిరిగారి సతీష్, గవ్వల రమణ, లక్ష్మినారాయణ, ఆశ్రమం మెయింటెనెన్స్ ఇన్‌ఛార్జి కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

బక్రీద్ పండుగ సందర్భంగా ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతంకలిగిస్తే కఠిన చర్యలు తప్పవని పుట్టపర్తి తహశీల్దార్ నవీన్ కుమార్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన స్థానిక తహశీల్దార్‌కార్యాలయంలో బుధవారం మండల స్థాయి జాయింట్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ బక్రీద్ పండుగ సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ నరసింహులు, పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీనివాసులు, పోలీసులు, ముతవల్లిలు తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఎ అధ్యక్ష, కార్యదర్శులుగా నరసింహా రెడ్డి, సుప్రవీణ్

డాక్టర్ వెంకటరమణను సన్మానిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం ఐఎంఎ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. స్థానిక ఐఎంఎ హాలులో వైద్యులు ప్రత్యేక సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సుప్రవీణ్, ట్రెజరర్‌గా సతీష్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ గా చంద్ర కిరణ్ రెడ్డి, జాయింట్ సెక్రటరీగా ఆశోక్ రెడ్డిని ఎనుకున్నారు. అదే విధంగా సెంట్రల్ కౌన్సిల్ మెంబర్లుగా పద్మజ, షౌకత్ అలీ, స్టేట్ కౌన్సిల్ మెంబర్లుగా విశ్వనాథ్ రెడ్డి, హరీష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా అరుణ కుమారి, సంధ్య రాణి, షర్మిల బేగం, సుష్మ, నందిశేఖర్, వెంకట రమణ నాయక్, ప్రభాకర్ నాయుడు, సాయి స్వరూప్, చరణ్‌లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ నరసింహ రెడ్డి, సెక్రటరీ సుప్రవీణ్ మాట్లాడుతూ హిందూపురం ప్రజల ఆరోగ్యం కోసం పాటు పడుతామన్నారు. అలాగే డాక్టర్ల అభ్యున్నతికి దోహదపడతామని చెప్పారు. అనంతరం పూర్వ అధ్యక్షులు, చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ వెంకటరమణను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు అశ్వర్థ రెడ్డి, రమేష్ రెడ్డి, కేశవులు, ఆదినారాయణ, శ్రీనివాస రెడ్డి, రామమూర్తి, బాలాజీ, లోకనాథ రెడ్డి, రత్నకుమారి, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఎ అధ్యక్ష, కార్యదర్శులు నరసింహారెడ్డి, సుప్రవీణ్

30న వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ఈనెల 30న సబ్ స్టేషన్ల ముందు ఆందోళన చేపడుతున్నట్లు సిపిఎం, సిపిఐ నాయకులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఆ పార్టీల నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పెంచిన విద్యుత్ చార్జీలు అప్రకటిత విద్యుత్ కోతలు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ట్రూఆఫ్ చార్జీల పేరుతో విద్యుత్ బారాలు మోపడాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా సబ్ స్టేషన్ల ముందు ఆందోళన చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగానే సత్యసాయి జిల్లాలో అన్ని సబ్ స్టేషన్ల వద్ద ఆందోళనలు చేపడతామన్నారు. 30న చేపట్టే ఆందోళన లో రైతులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు ఇఎస్ వెంకటేష్, రామకృష్ణ, బ్యాల్ల అంజి, సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, నియోజకవర్గం కార్యదర్శి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ వామపక్షాల అధ్వర్యంలో 30న విద్యుత్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి జి.ఎల్ నరసింహులు, సిపిఐ డివిజన్ కార్యదర్శి కడిరప్ప పిలుపునిచ్చారు. కదిరి పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో సిపిఐ పట్టణ కార్యదర్శి లియకత్ అధ్యక్షతన సిపిఎం, సిపిఐ నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సూచన మేరకు 9సార్లు వివిధ రకాలుగా విద్యుత్ ఛార్జీలు పెంచారని విమర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేదల నడ్డి విరిచే విధంగా వ్యవహరిస్తున్నాయన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలన్న డిమాండ్‌తో విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ డివిజన్ కార్యదర్శి కదిరప్ప, సిపిఎం, సిపిఐ నాయకులు జగన్ మోహన్, రామమోహన్, బాబ్జన్, మనోహర్, మహేంద్ర, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తున్న కళాశాలపై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి-హిందూపురం

ప్రభుత్వ నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి ఆకర్షణల పేరుతో వేలాది రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్న నారాయణ జూనియర్ కళాశాలపై విద్యాశాఖ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు పట్టణంలోని నారాయణ జూనియర్ కళాశాలలో ఒక్క కోర్సును పెట్టి ఆ కోర్సు ఆకర్షణీయమైన పేర్లలను పెట్టి విద్యార్థుల తల్లిదండ్రులను నిలువు దోపిడి చేస్తున్నారన్నారు. ఇంటర్‌లో ఎంపిసితో పాటు జెఈఈ, జెడ్ఎఫ్-2, ఎంసెట్‌లకు ప్రత్యేక శిక్షణ ఇస్తామని చెప్పి రూ.35వేల నుంచి 50వేల రూపాయల వరకు అదనంగా ఫీజులను వసూలు చేస్తున్నారన్నారు. దీంతో పాటు కళాశాలలోనే పుస్తకాలను కొనాలన్న నిబంధనలు విధించి దానికి అదనంగా రూ.8వేలు వసూలు చేస్తు విద్యను వ్యాపారం చేస్తున్నారని విమర్శించారు. ఇంత పెద్ద ఎత్తున దోపిడీ చేస్తు కళాశాలలో విద్యార్థులకు అవసరమైన కనీస సౌకర్యాలను కల్పించడం లేదన్నారు. నిబంధనలు పాటించని కళాశాలపై చర్యలు తీసుకోవాల్సిన విద్యాశాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం తగదన్నారు. ఇప్పటికైన ఆర్ఐఒ వెంటనే కళాశాలను తనఖీ చేసి తగిన చర్యలు తీసుకోకపోతే ఆర్ఐఒ కార్యాలయాన్ని ముట్టిడిస్తామని హెచ్చరించారు.

కదిరిలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలి

కదిరి అర్బన్ : పట్టణంలో అదనపు పోలీస్ స్టేషన్, ట్రాఫిక్, మహిళా పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త పిఎస్ అహ్మద్ హుస్సేన్ కోరారు. ఈ మేరకు ఆయన తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి కి అందించారు. ఈసందర్భగా అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ కదిరి పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందన్నారు. సమస్యను పరిష్కరించాలంటే ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ చాలా అవసరం అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ బాలకృష్ణ యాదవ్, యూత్ కాంగ్రెస్ నాయకులు రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

వర్షం నీటితో నిండిన పేరూరు డ్యాం : టిడిపి

విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి - రామగిరి

వర్షం వచ్చి పేరూరు డ్యాం నీటితో నిండితే అది వైసిపి గొప్పతనమా అని టిడిపి నాయకులు ఎద్దేవా చేశారు. మంగళవారం ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి చేసిన వ్యాఖ్యల మీద రామగిరి మండల టిడిపి నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వర్షాలు వచ్చి పేరూరు జలాశయానికి నీరు వస్తే అది తామే తెచ్చినట్టు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కనీసం నాలుగేళ్లలో జలాశయం గేట్ల నిర్వహణ కూడా సరిగా చేయలేదని విమర్శించారు. వచ్చిన నీరును సరిగా వినియోగించలేక వథా చేసిన చేతగాని నేతలని విమర్శించారు. పేరూరు గ్రామంలో బస్సు షెల్టరు నిర్మిస్తే దానిని కూడా వారి అనుచరులతో కూల్చివేశారని ఆరోపించారు. మైనింగ్ దొంగలు... ఉపాధి దొంగలు.. ఇసుక దొంగలు అని అంటుంటే.. దొంగే దొంగ అన్నట్టుగా ఉందని విమర్శించారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం 20 ఏళ్లు వెనుకబడి పోయిందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు వైసిపికి తగిన బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో టిడిపి మండల కన్వీనర్ సుధాకర, తెలుగు యువత అధ్యక్షులు శ్రీధర్ నాయుడు, ఎస్సీ సెల్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి డి పోతన్న, మైనార్టీ అధ్యక్షులు దాదా పీరా, గ్రామ కమిటీ అధ్యక్షులు సుబ్బు, పేరూరు 2 యూనిట్ ఇంచార్జ్ వెంకటేశ్, సురేష్, మండల కమిటీ కోశాధికారి శ్రీనివాస్, భాస్కర్ రెడ్డి, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై క్విజ్ పోటీలు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ఆర్థిక అక్షరాస్యత పై పాఠశాలల్లో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించినట్లు లీడ్ బ్యాంకు మేనేజర్ ఎవి. కుమార్ తెలిపారు. బుధవారం పట్టణంలోని చిన్న పల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ క్విజ్ పోటీలలో జిల్లాలోని 25 పాఠశాలల నుంచి ఒక్కో పాఠశాల నుంచి ఇద్దరు పాల్గొన్నారు. జి. 20 ఈవెంట్లలో భాగంగా రిజర్వ్ బ్యాంక్ ఆర్థిక అక్షరాస్యతపై ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ఆర్థిక విషయాలకు సంబంధించిన కంటెంట్, అభివృద్ధి, బ్యాంకులకు సంబంధించి అవగాహన కల్పించడానికి ఈ క్విజ్ పోటీలు ఉపయోగపడతాయన్నారు. ఈ పోటీలలో తలుపుల పాఠశాల కు చెందిన సుశాంత్ రెడ్డి, శ్రీనాద్ లు మొదటి స్థానంలో రెండవ స్థానంలో ధర్మవరానికి చెందిన విద్యార్థులు జాన్ మోసి వంశిక, మూడో స్థానంలో బత్తలపల్లి జెడ్పి పాఠశాలకు చెందిన మదీనా, ఆఫ్రిద్ సుహాన్ నిలిచారన్నారు. మొదటి స్థానంలో ఉన్నవారికి రూ. 10 వేలు, రెండవ స్థానంలో నిలిచిన వారికి రూ. 7500, మూడవ స్థానంలో నిలిచిన వారికి రూ. 5 వేలు నగదు బహుమతులుగా అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు జూలై 14న విశాఖలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల పిల్లలు,ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాసేవే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ప్రజా సమస్యలను పరిష్కరించుకుంటూ ఆపద సమయాలలో ప్రజలను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, తొమ్మిదవ వార్డ్ కౌన్సిలర్ మాసపల్లి సాయికుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నూరు గ్రామవాసి గంట మల్లి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతిచెందాడు. ఈ మేరకు వైఎస్ఆర్ బీమా పథకం కింద, బాధిత కుటుంబానికి తక్షణసాయం కింద పదివేల రూపాయల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ కార్యదర్శి వలీబాషా, వాలంటీర్ లోకేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.



బీమా పథకం కింద తక్షణ సాయం అందిస్తున్న మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మాసపల్లి సాయికుమార్

చిత్రావతి నదిలో పడి వ్యక్తి మృతి

పుట్టపర్తి క్రైమ్ : చిత్రావతి నదిలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని శవాన్ని వెలికి తీశారు. నదిలో పడిన వ్యక్తి బుక్కపట్నానికి చెందిన శ్రీనివాస్ రావు (57) అనే వ్యక్తిగా గుర్తించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ బాలసుబ్రమణ్యం రెడ్డి తెలిపారు.

దానిమ్మ ,మామిడి చెట్లు దగ్ధం

కొత్తచెరువు : కొత్తచెరువు సమీపంలోనే లింగారెడ్డిపల్లి రహదారిలో కొత్తచెరువుకు చెందిన కోళ్ల సుబ్బన్న అనే రైతు తన పొలంలో సాగు చేసిన మామిడి, దానిమ్మ చెట్లు అగ్నిప్రమాదంలో దగ్ధమయ్యాయి. గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి నిప్పు పెట్టడంతో చెట్లు పూర్తిగా దగ్ధమయ్యాయి వాటితో పాటు చెట్ల కున్న డ్రిప్పు పైపులైను పూర్తిగా కాలిపోయాయి. దీంతో తనకు దాదాపు రూ. 5 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు. 10 సంవత్సరాలుగా పంటను సాగు చేసుకుంటున్నానని తీరా కాపునకు వచ్చిన సమయంలో ఇలా జరిగిందని ఆవేదన వ్యక్తం చేశాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

బత్తలపల్లి : జూనియర్ ఎన్టీఆర్ అభిమాని శ్యామ్ అనే వ్యక్తి అనుమానాస్పద మృతి పట్ల టిడిపి నాయకులు, ఎన్టీఆర్ ఫ్యాన్స్ నిరసన వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఎన్టీఆర్ నిరసన వ్యక్తం చేస్తూ, శ్యామ్ మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్యామ్ మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ ఫ్యాన్స్ మండల అధ్యక్షులు నెట్టెం రమణ, ఉపాధ్యక్షులు బత్తల మనోజ్, జనరల్ సెక్రటరీ దేరంగుల హరిప్రసాద్, సతీష్, మందల రాము, రామాంజి, నాగార్జునరెడ్డి, నాగభూషణ, యర్రప్ప, తరిగోపుల చౌదరి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

రొద్దం : మండలంలోని పెనుకొండ పావగడ ప్రధాన రహదారిలో రొద్దం, మరువపల్లి మధ్యలో నమాజు కట్ట వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. సోమందేపల్లి మండలం రంగేపల్లి గ్రామానికి చెందిన కదిరిప్ప పావగడ వైపు నుంచి ద్విచక్రవాహనంలో సొంత గ్రామానికి వెళుతుండగా నమాజు కట్ట ప్రహరికి బండలకు తగిలి కిందికి పడ్డాడు. తీవ్రగాయాలైన కదిరప్పను రోడ్డుపై వెళ్లే వారు ట్రాక్టర్ ద్వారా రొద్దం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

పుట్టపర్తి రూరల్ : పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జగరాజు పల్లి, పైపల్లి గ్రామాల్లో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ జ్యోత్స్న వైద్యసేవలు అందించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ నగేష్, సూపర్ వైజర్లు వెంకట రమణ, చంద్రకళ, లక్ష్మి నారాయణమ్మ , అపర్ణ,ఆరోగ్య కార్యకర్తలు శివ, నాగజ్యోతి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కంపచెట్లు తొలగింపు

చిలమత్తూరు : మండల పరిధిలోని కోడూరు గ్రామపంచాయతీ కనిశెట్టిపల్లి-వడ్డిపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన దారికి ఇరువైపులా పెరిగిన ముళ్లకంప చెట్లను తొలగించారు. సర్పంచి మురళీ మోహన్ ఆధ్వర్యంలో జేసిబీ సాయంతో తొలగించారు.

పండ్లతోటల పెంపకంపై అవగాహన

అమరాపురం : ఉపాధి హామీ పథకంలో భాగంగా రైతులు మెట్ట ప్రాంతాల్లో పండ్లతోటల పెంపకంపై దృష్టి సారించాలని ఎపిడి జయసింహ కోరారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏపీవో గోపాల అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏపిడితోపాటు క్లస్టర్ డెవలప్మెంట్ ఆఫీసర్ లక్ష్మి నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మెట్ట ప్రాంతాల్లో పండ్లతోటల పెంపకాన్ని ప్రాధాన్యతను ఇస్తున్నాయన్నారు. ఆసక్తి గల రైతులు జాతీయ ఉపాధి హామీ పథకం కింద సాగు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ముస్లిములకు ‘కందికుంట’ బక్రీద్ శుభాకాంక్షలు

కదిరి టౌన్ : నియోజకవర్గంలోని ముస్లిం సోదర సోదరీ మణులకు కదిరి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జికందికుంట వెంకట ప్రసాద్ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. త్యాగం, సహనానిని ప్రతీక బక్రీద్ పండుగ అని అన్నారు.

గొర్రెల కాపరికి ఆర్థికసాయం

బత్తలపల్లి : మండలంలోని పోట్లమర్రి గ్రామానికి చెందిన గొర్రెల కాపరి నాగరాజుకు చెందిన 10 గొర్రె పిల్లలను వారం రోజుల క్రితం కుక్కలు చంపేశాయి. దీంతో కొంతమంది కురుబ సంఘం నాయకులు స్పందించి ఎవరికి తోచిన విధంగా విరాళాలు సేకరించారు. సేకరించిన విరాళాన్ని కురువ సంఘం యూత్ అధ్యక్షులు రాజశేఖర్ ఆధ్వర్యంలో నాగరాజుకు అందజేశారు. గొర్రెల కాపరి నాగరాజు ఇంటికి వెళ్లి గ్రామ పెద్దల సమక్షంలో రూ. 26, 500లను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోనాపురం పామాల వినోద్, బత్తలపల్లి కురుబ సంఘం తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయులపై దాడులు అమానుషం

పుట్టపర్తి రూరల్: శ్రీ సత్యసాయి జిల్లాలో పాత్రికేయులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని ఐజెయు జాతీయ కార్యవర్గ సభ్యుడు శ్రీనివాసులు అన్నారు. ధర్మవరం నియోజకవర్గంలోని ఓ టీవీ ఛానల్ విలేకరిపై బుక్కపట్నం మండలం మారాల గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ రామ్మోహన్ కొంతమంది అనుచరులతో దాడికి పాల్పడం అమానుషమన్నారు. ఆ ఫీల్డ్ అసిస్టెంట్‌ను విధులనుండి తొలగించి అతనిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా ఏపీడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్ట్ నాయకులు సంఘం అధ్యక్షులు జిల్లా ఎస్పీ మాధవరెడ్డికి ఎస్పీ కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందజేశారు.

ఆల్ ఇండియా జీవిత బీమా అసోసియేషన్ ఛైర్మన్‌గా కదిరి వాసి

కదిరి టౌన్ : భారతీయ జీవిత బీమా సంస్థ ఆల్ ఇండియా ఏజెంట్ల యూనియన్ అసోసియేషన్ ఛైర్మన్‌గా కదిరికి చెందిన ఎం. నారాయణరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ బెంగళూరులో జరిగిన భారతీయ జీవిత బీమా సంస్థ ఏజెంట్ల సమావేశంలో ఆలిండియా ఏజెంట్ల సంఘం అధ్యక్షుడిగా తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు.కదిరి బ్రాంచ్ నుండి ఏజెంట్లు అసోసియేషన్ తరపున కదిరికి చెందిన వ్యక్తి ఆల్ ఇండియా ఛైర్మన్‌గా ఎన్నికవ్వడం గర్వకారణమని కదిరి బ్రాంచ్ ప్రెసిడెంట్ క్రిష్టప్ప అన్నారు. కడప డివిజన్లోని 20 బ్రాంచ్ ల ఏజెంట్లు, సెక్రెటరీ కెవి రమణారెడ్డి, యూనియన్ ఏజెంట్లు నారాయణ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

నాడు-నేడు పనులతో విప్లవాత్మక మార్పులు

పుట్టపర్తి రూరల్ : ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మనబడి నాడు నేడు కింద చేపట్టిన పనులు విద్యాలయాల్లో ఎన్నో మార్పులకు కారణం అవుతున్నాయని పెడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామచంద్ర రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం నిర్వహించిన విద్యార్థుల తల్లిదండ్రులు సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పాఠశాలలో అమలు చేస్తున్న తీరును వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

తనకల్లు : మండల పరిధిలోని కొక్కంటి క్రాస్ వద్ద మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్ వాహనాల తనిఖీని నిర్వహించారు. రికార్డులు సరిగా లేని వాహనాలపై కేసు నమోదు చేశారు. పాఠశాల వాహనాలు ఫిట్నెస్ కలిగి ఉండాలని ఆదేశించారు..ఈ కార్యక్రమంలో ఆర్టీవో సిబ్బంది పాల్గొన్నారు.

శుద్ధజలకేంద్రం ప్రారంభం

లేపాక్షి : మండలం పరిధిలోని గౌరీగానిపలిలో ఏర్పాటు చేసిన శుద్ధజల కేంద్రాన్ని సర్పంచి నిర్మల ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. శ్రీరామ్ పవర్ సోలార్ వారి సౌజన్యం తో ఏర్పాటుచేసిన ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో శ్రీరామ్ సోలార్ ప్లాంట్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు